మలక్‌పేటలో ప్రశాంతంగా గ్రూప్-2

- రెండో పరీక్షకు 1,664 మంది అభ్యర్థులే హాజర్
- మొదటి రోజుతో పోల్చితే మరో 39 మంది గైర్హాజర్

చాదర్‌ఘాట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షల్లో రెండో రోజైన సోమవారం మలక్‌పేటలోని 12 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులకూ తావులేకుండా ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల మొదటి రోజైన ఆదివారం 5,875 మంది అభ్యర్థులకు 1,703 మంది అభ్యర్థులే హాజరయ్యారు. సోమవారం 1,664 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు వివరించారు. మొదటి రోజుతో పోల్చితే రెండో రోజు (సోమవారం)పరీక్షకు మరో 39మంది అభ్యర్థు గౌర్హాజరు అయ్యారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షను నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-3 పరీక్ష జరపగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్-4 పరీక్షను నిర్వహించారు. పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు.



మార్గదర్శికాలనీ మాజీ అధ్యక్షుడు గంగారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడికి పరామర్శ

ఎల్‌బీనగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ మార్గదర్శి కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గంగారెడ్డిని సోమవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పరామర్శించారు. గంగారెడ్డి సతీమణి సత్యమ్మ ఇటీవల మరణించారు. ఆ సమాచారం తెలియడంతో సోమవారం మార్గదర్శికాలనీలోని గంగారెడ్డి నివాసానికి వెళ్లిన సబితాఇంద్రారెడ్డి గంగారెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కంచర్ల శేఖర్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, జాహిద్, శ్యాంగుప్తా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుప్పావై పారాయణం చేస్తున్న మహిళలు

ఆలయాల్లో ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలోని ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యారు. ఇందులో భాగంగా భక్తులు, ముఖ్యంగా మహిళలు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై పారాయణాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయశ్రీకాలనీలో గల పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి ఆధ్వర్యంలో, శ్రీసాయినగర్‌లోని దుర్గాదేవి ఆలయంలో ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పూజారి బాల మురళీశర్మ అమ్మవారికి తిరుప్పావై సేవ, ఇతర పూజలు నిర్వహించారు.



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న కేఎల్లార్

అన్ని మతాలను గౌరవించేది కాంగ్రెస్ ఒక్కటే

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

సరూర్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాలను సమానంగా గౌరవించేది, అన్ని వర్గాలకు సరైన న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లోని చర్చిలో ఆదివారం రాత్రి పాస్టర్ సాయిలు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దానిని తిప్పికొట్టి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.



హోసన్న చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న అనిల్ థామస్, ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మన్సూరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లోని హోసన్న మందిర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఏఐసీసీ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ అనిల్ థామస్, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హోసన్న మినిస్ట్రీస్ ప్రధాన పాస్టర్ అబ్రహం నేతృత్వంలో యేసు ప్రభువుకి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఎం.వర్మ, ముఖ్య ప్రధానకార్యదర్శులు రవి, జక్కర్య, శివాజీ, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మహేశ్వరం అధ్యక్షుడిగా శ్రీధర్



సరూర్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు క్యారగారి శ్రీధర్ నియమితులయ్యారు. సోమవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం స్థాపన దిశగా అడుగులు వేస్తున్నదని, దళితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని అన్నారు. పార్టీ పదవులు పొందిన నాయకులు అహర్నిశలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానని, నియోజకవర్గం వ్యాప్తంగా దళితులను చైతన్యపరిచి కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి యెల్లేటి అమరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి సామ వరుణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం సందీప్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, బాల్‌నింగని జంగయ్య, అమృతానాయుడు, గొల్లూరు రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే షురూ

చాదర్‌ఘాట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే సోమవారం షురూ అయ్యింది. జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో, ఓల్డ్‌మలక్‌పేటలో, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

మలక్‌పేట నియోజకవర్గంలో 29,061 దరఖాస్తులు

మలక్‌పేట నియోజకవర్గంలో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సర్వే ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మలక్‌పేట నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. ఇందు కోసం నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నుంచి 29,061 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా 6,796 దరఖాస్తులు అజంపుర డివిజన్ నుంచి రాగా అత్యల్పంగా 2,474 దరఖాస్తులు చావునీ డివిజన్ నుంచి వచ్చాయి.



8వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు

ఆరు డివిజన్లకు ఆరుగురు సూపర్ వైజర్లు, 23 మంది సర్వేయర్లు

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అవసరమైన వివరాలను సేకరించేందుకు ఆరు డివిజన్లకు ఆరుగురు సూపర్‌వైజర్లు 23 మంది సర్వేయర్లను ప్రత్యేకంగా నియమించారు. సోమవారం ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఈ నెలాఖరునాటికి పూర్తికానుంది. ఇప్పటికే సూపర్‌వైజర్లకు, సర్వేయర్లకు గ్రేటర్ కమిషనర్ కార్యాలయంలో గత శుక్రవారం శిక్షణను కూడా నిర్వహించారు.



ఓల్డ్‌మలక్‌పేటలో ఇందిమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

- **సైదాబాద్ డివిజన్‌**కు సూపర్‌వైజర్‌గా సర్కిల్-6 ఏఎంసీ టి.సంజయ్‌సింగ్‌ను సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈయన కింద నియమితులైన నలుగురు సర్వేయర్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న 4,934 మంది నుంచి వివరాలను సేకరిస్తున్నారు.
- **ముసారాంబాగ్ డివిజన్‌**కు సర్కిల్-6 ఏఎంసీ టి.మురళీమోహన్‌ను సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈయన కింద నియమితులైన నలుగురు సర్వేయర్లు 6,289 దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తారు.
- **ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌**కు సర్కిల్-6 సూపరింటెండెంట్‌గా అబుజిభీల్ గఫార్‌ను సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈయన కింద నియమితులైన నలుగురు సర్వేయర్లు 4,661 దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తారు.
- **అక్బర్‌బాగ్ డివిజన్‌**కు సర్కిల్-6 సూపరింటెండెంట్ ఎండీ సాజిద్‌ను సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈయన కింద నియమితులైన నలుగురు సర్వేయర్లు 3,907 దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తారు.
- **ఆజంపుర డివిజన్‌**కు సర్కిల్-6 సీనియర్ అసిస్టెంట్ పి.దుర్గాదాస్‌ను సూపర్‌వైజర్‌గా ఉన్నారు. ఈయన కింద నియమితులైన నలుగురు సర్వేయర్లు 6,796 దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేస్తారు.
- **చావునీ డివిజన్‌**కు సర్కిల్-6 సూపరింటెండెంట్ జి.శ్రీకాంత్‌ను సూపర్‌వైజర్‌గా నియమించారు. ఈయన కింద నియమితులైన ముగ్గురు సర్వేయర్లు 2,474 దరఖాస్తుదారుల వివరాలను సేకరించాల్సి ఉంటుంది.

ఓల్డ్‌మలక్‌పేట పరిధిలో..

ఓల్డ్‌మలక్‌పేట: ఓల్డ్‌మలక్‌పేటలో అధికారులు సంజయ్‌సింగ్, నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైంది. దరఖాస్తుదారుల ఫోన్‌నంబర్, అడ్రస్ ఆధారంగా ఇంటి వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కోసం అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇంటి వద్దనే ఉన్నారు. ఈనెల చివరి వరకల్లా ఇళ్ల సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది.

అర్హులందరికీ ఇందిర్మ ఇళ్లు అందిస్తాం

చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జయశ్రీరాజు మాట్లాడుతూ సర్వే పూర్తి అయిన వెంటనే మొదటి విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. మున్సిపాలిటీకి చెందిన అధికారులు దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. సొంత ఖాళీస్థలం ఉంటే అక్కడే స్థలంతోపాటు ఇంటి యజమాని ఫొటోలను తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కిరాయిదారులైతే వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నారు. డాక్యుమెంట్ ఉంటే వాటి వివరాలు, గ్రామ కంఠం అయితే ఇంటి ట్యాక్ లేదా విద్యుత్‌బిల్లు వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): డివిజన్‌లోని పరిసరాలను శుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పారిశుధ్యంపై సోమవారం హయత్‌నగర్ సర్కిల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో నిత్యం చెత్తకుప్పలు పేరుకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తుండడంతోనే కాలనీలో పారిశుధ్య సమస్యలు తలెత్తున్నాయన్నారు. ఇక నుంచైన పారిశుధ్య కార్మికులు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా తీర్చిదిద్దాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ దామోదర్, శానిటేషన్ డీఈ నీలిమ, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తా

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మూసీ అభివృద్ధికి తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. కానీ మూసీ అభివృద్ధి పేరిట పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూలగొడతామంటే..ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి సంతోష్‌కుమార్, అదనపు ప్రధానకార్యదర్శి గిరిధర్, కోశాధికారి అశోక్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, తులసి కృష్ణగౌడ్, తిరుపతి స్వామి, శ్రీనివాసచారి, మల్లారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కమెండోలు

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం మీవెంటే

బిట్స్‌పిలానీ, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో ప్రయత్నిస్తే విజయాలు మన వెంటే ఉంటాయని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దీపక్‌శర్మ పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల ఆధ్వర్యంలో జరిగిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో 29వ ఇంటర్ కాప్స్ డిబెట్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. న్యూఢిల్లీలోని అటల్ అక్షయ ఊర్జాభవన్‌లో దేశంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ బలగాలకు (సీఐఎస్‌ఎఫ్) పోటీలను సోమవారం నిర్వహించారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ హైదారాబాద్ గ్రూప్ సాయుధ బలగాలు ఉత్తమ ప్రతిభను కనబర్చి ట్రోఫీని కైవసం చేసుకున్నాయి. మానవహక్కుల సమస్యలు - అవగాహనలో ఎస్‌ఐ రాహుల్, అసిస్టెంట్ కమాండెంట్ కన్యాజోషి ప్రతిభ చూపారు.

టీజీఓఏ ప్రధాన కార్యదర్శికి సన్మానం



తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లారెడ్డిని సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

హయత్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ (టీజీఓఏ) ప్రధానకార్యదర్శి పి.మల్లారెడ్డిని సోమవారం తిరుమల హౌసింగ్‌కాలనీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అన్మగల్ హయత్‌నగర్ 12 కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. తిరుమల హౌసింగ్ కాలనీతోపాటు సమీప కాలనీల అభివృద్ధి కోసం తనవంతు సహకారాన్ని అందిస్తానని మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తిరుమల కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ నిర్మాణానికి మల్లారెడ్డి రూ.3లక్షలు, నరసయ్య రూ.51వేలు ప్రకటించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవుజా నాయక్, ప్రధానకార్యదర్శి మాదగోని రమేష్, నాయకులు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కార్యనిర్వాహకాధికారి పర్వతం శ్రీనివాసచారి, జేఏసీ సభ్యులు వీరస్వామి, వీరభద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరబాబు, రవీందర్‌రెడ్డి, రాములు, ఉపేందర్ రెడ్డి, వెంకట నరసయ్య, వెంకటరామయ్య, పుల్లారావు, చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహచారి, సుర్యానాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ప్రోకబడ్డీ జూనియర్స్‌లో రాణించాలి

- టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ శ్రీనివాస్ గుప్తా



ట్రాక్‌సూట్లు ధరించిన క్రీడాకారులతో శ్రీనివాస్‌గుప్తా, ఎంఈఓ రామారావు తదితరులు

మన్సూరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే ప్రోకబడ్డీ జూనియర్స్ పోటీల్లో అద్భుత ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలిచి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని నాగోల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన క్రీడాకారులకు టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా సూచించారు. కొన్ని రోజులుగా పాఠశాలలో ప్రోకబడ్డీ జూనియర్స్ జాతీయస్థాయి పోటీలకు సన్నాహకంగా నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఉప్పల్ మండల ఎంఈఓ రామారావుతో కలిసి క్రీడాకారులకు ట్రాక్‌షూట్‌లను విద్యార్థులకు, ఫిజికల్ డైరెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన క్రీడా పాలసీ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోందని, నాగోల్‌లోని ప్రభుత్వపాఠశాలకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం జాతీయ స్థాయి ప్రోకబడ్డీ జూనియర్స్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, నాగోల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ, పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు చంద్రశేఖర్ ఆజాద్, పల్లె లింగంగౌడ్, నాళ్ల ఉమామహేశ్వర్‌రావు, జగదీష్, రంజిత్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్‌నాయక్, మమత, ఉపాధ్యాయులు రవికుమార్, విమల తదితరులు ఉన్నారు.



బీపీడీఏవీ విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న బీడీఎల్ ఈడీ, యూనిట్ హెడ్ ఎం.రవి, ప్రిన్సిపాల్ తదితరులు

విద్యార్థులకు స్వచ్ఛత పక్వాడ బహుమతులు

చంపాపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధాని టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాలలో మూడు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఇటీవల భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్)ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ అధ్యక్షతన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యూనిట్ హెడ్ ఎం.రవి, డీజీఎం(హెచ్‌ఆర్)టి.శ్రీధర్, సీనియర్ మేనేజర్ పి.శ్రీరామ్, వెల్ఫేర్ డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఆర్)ఎస్.జయదనమ్మ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. విజేతలను డీఏవీ పాఠశాలల ఏఆర్‌ఓ ఆనందవల్లి, ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ అభినందించారు.

అధికారులపై దాడులను అరికట్టాలి

- ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల విజ్ఞప్తి

పంజాగుట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులపై భౌతికదాడులను అరికట్టాలని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌గూడలో ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం చెరువు బఫర్ జోన్‌లో చేపట్టిన అక్రమనిర్మాణాన్ని పరిశీలించేందుకు వెళ్లిన నీటిపారుదల శాఖ ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్, రెవెన్యూ సిబ్బందిపై దాడి చేశారన్నారు. ఇంజనీర్, సిబ్బంది చిత్రీకరించిన వీడియోను డిలీట్ చేసి వారిని బెదరించారన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. లేని పక్షంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, ట్రైగర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూనె శ్రీధర్, ఉపాధ్యక్షులు వి.ప్రకాశ్, కార్యదర్శి టీవీ ప్రసాద్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏఎస్‌ఎన్ రెడ్డి, కార్యదర్శి చక్రధర్, ఏటీఏఈఈ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి కిందపడి కార్మికుడి మృతి



పుట్ట కొమురయ్య(ఫైల్)

వనస్థలిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లారీలోని సరుకులను అన్‌లోడ్‌చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌కు చెందిన పుట్ట కొమురయ్య(53)కు ఇద్దరు పిల్లలు. కూతురికి పెళ్లైంది. కొడుకు, భార్యతో కలిసి కొమురయ్య జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా వనస్థలిపురం ఆటోనగర్‌లోని దీపక్ ట్రాన్స్‌పోర్ట్‌లో లేబర్‌గా చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం దీపక్ ట్రాన్స్‌పోర్ట్ వద్ద ఉదయం కొమురయ్య లారీలోని సరుకులకు అన్‌లోడ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు తాడు తెగి లారీ పైనుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతోనే తమ కుటుంబ సభ్యుడు మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని సభ్యులు దీపక్ ట్రాన్స్‌పోర్ట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి నిరసన విరమింపచేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం



సురేఖ (ఫైల్)

హయత్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గృహిణి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కొంతకాలంగా మునగనూరు మల్లికార్జునగర్‌లో పాండురంగ శంకర్ జగ్ధాడే ఆయన భార్య సురేఖ(24) ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో సురేఖ ఇద్దరు పిల్లలను వదిలేసి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త శంకర్ బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.